క్లుప్తంగా

ఉపాధి హామీ పనులపై గ్రామసభలు

ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం, యర్రగుంట్లపాడు, శిరంగిపాలెం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంపై గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు సంబంధించి పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నిర్వహించిన అభివృద్ధి పనులపై ప్రజలతో ఆయా శాఖల రాష్ట్ర రిసోర్సుపర్సన్లు రాజు, రామారావులు మాట్లాడారు. ఏప్రాంతాల్లో పనులు నిర్వహించారో అక్కడకు వెళ్లి పనులు పరిశీలించారు. ప్రజల నుంచి అభివృద్ధి పనులపై వివరాలు సేకరించి వాటికి సంబంధించిన రికార్డులు తనిఖీచేశారు. కార్యక్రమంలో ఈసీ ప్రభాకర్, ఆయాగ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నిరసన

మంగళగిరి: వైద్య విధానంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బందెల నాసర్‌జి మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చేందుకు తెచ్చిన జీఓలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ యార్లగడ్డ శివ గోపి, కో కన్వీనర్ మత్తె అభిషేక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఐరన్ పోలిక్ మాత్రలు విద్యార్థులకు గురువారం పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ఫరీనా బేగం తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత విద్యార్థులచే మాత్రలు మింగించారన్నారు. పదిగ్రాముల కన్నా తక్కువ రక్తం ఉన్నవారికి రోజుకు రెండుమాత్రలు చొప్పున మింగించాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వారికి రక్తపూత పరీక్షలు చేసి తక్కువగా ఉన్నవారిని గుర్తిస్తున్నట్లు వివరించారు.

పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

మంగళగిరి: నగరంలోని పార్కురోడ్డు ఆర్‌సీఎం పాఠశాలలో గురువారం పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్టణం తాలూకా గురిజేపల్లి గ్రామ సర్పంచ్ అద్దంకి లక్ష్మణ్‌స్వామి జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ సెక్రటరీ గరికముక్కు డేవిడ్, బూసి గోవిందరాజు, పాస్టర్ స్టీఫెన్, బీసీ నాయకులు గొర్రె నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు గంజి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. నగరంలోని ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు ఆధ్వర్యంలో అంధులకు, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రైతులకు గ్రామ విత్తన పథకంపై శిక్షణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడ గ్రామంలో గురువారం రైతులకు గ్రామ విత్తన పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారి శ్రీరంజని విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామ విత్తన పథకం ద్వారా తీసుకున్న విత్తనాలను సుడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసి వెద పెట్టడం ద్వారా మొదటి 30 రోజులు తెగులు ఆశించకుండా ఉంటుందని వివరించారు. విత్తనం మొలక కట్టుకుని ఎకరానికి 12 నుంచి 15 కిలోల వరకు వెద పెట్టాలని సూచించారు. ఏడీఏ హైమావతి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాన్ని గ్రామంలో రైతులకు అందుబాటులో పెట్టడమే విత్తన పథకం ముఖ్యోద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నీలం వెంకటేశ్వరరావు, నందిపాటి శాంతిశ్రీ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం పుచ్చలపల్లి సుందరయ్య మార్గంలో ఇటీవల నూతనంగా చేపట్టిన రెండు సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.45లక్షల నిధులతో ఈ రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొన్ని రోజుల కిందట చేపట్టగా గురువారంతో పూర్తయ్యాయి.త్వరలోనే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రారంభిస్తారని నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. బసవతారక నగర్‌లో సుమారు రూ.1.05 కోట్లతో ఇటీవల రెండు సీసీ రోడ్లు నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయని, ప్రస్తుతం ఒక సీసీ రోడ్డుకు భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మార్గంగానూ, మరో సీసీ రహదారికి మహాత్మా జ్యోతిరావు పూలే మార్గంగా నామకరణం చేసినట్లు తెలిపారు. త్వరలోనే రెండు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభిస్తారని డీఈ తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీ

తాడికొండ: మణిపూర్‌లో ఆదివాసీలు, గిరిజనుల నరమేథంపై ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ స్పందించకపోవడం దారుణమని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్‌కుమార్ అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా తాడికొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ లియాకత్‌అలీ, ఎ.సూర్యనారాయణ, శ్రీనివాస్, రహంతుల్లా, షేక్ అబ్దుల్ అలీ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పనే లక్ష్యం

- ఈనెల 7 నుంచి అందుబాటులోకి చేనేత మగ్గాల షెడ్లు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)


చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పనే లక్ష్యంగా నగరంలోని రాజీవ్ గృహకల్ప సముదాయం ఆవరణలో చేనేత మగ్గాల షెడ్లను నిర్మించామని, ఈనెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చెప్పారు. ఎమ్మెల్యే ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి గురువారం చేనేత మగ్గాల షెడ్లను పరిశీలించి చేనేత కార్మికులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మంత్రిగా ఉన్న హయాంలో నగరంలోని ఎర్రచెరువు ప్రాంతంలో రాజీవ్ గృహకల్ప సముదాయాలు నిర్మించారని, అప్పట్లోనే ఖాళీ స్థలాల్లో మగ్గాల షెడ్లు ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఆలోచన కూడా చేశారని గుర్తుచేశారు. అయితే దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణానంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు మగ్గాల షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయాయని చెప్పారు. ఈ నేపథ్యంలో చేనేత కార్మికులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజీవ్ గృహకల్ప ఆవరణలో చేనేత మగ్గాల షెడ్లను నిర్మించామని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రూ.3.60 కోట్లతో ఆరు మగ్గాల షెడ్లను నిర్మించామని, అందులో భాగంగా ఎన్‌హెచ్‌డీపీ కింద భారత ప్రభుత్వం రూ.1.10 కోట్ల నిధులు కేటాయించగా, కార్పొరేషన్ రూ.2.50 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. ఆరు మగ్గాల షెడ్లలో మొత్తం 146 మగ్గాలను ఏర్పాటు చేయగా వాటిలో సగం గుంట మగ్గాలు కాగా మరో సగం స్టాండ్ మగ్గాలు ఉన్నాయని తెలిపారు. రాజకీయాలకు తావు లేకుండా చేనేత కార్మికులకు నిష్పక్షపాతంగా మగ్గాలను కేటాయించామని, ఇప్పటికే చాలా మంది కార్మికులు మగ్గాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. రానున్న రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో మగ్గాలు ఏర్పాటు చేసుకుంటారని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు ఆకురాతి రాజేష్, బేతపూడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి ఐకాన్‌గా నేతన్న సర్కిల్ రూపకల్పన

మంగళగిరి ఐకాన్‌గా నేతన్న సర్కిల్‌ను రూపకల్పన చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. గురువారం ఆయన ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితోపాటు పలువురు చేనేత సంఘ నేతలతో కలసి నగరంలోని ఎన్నారై వై జంక్షన్ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత వృత్తిని తిరిగి వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చేనేతకు సంబంధించి మంగళగిరికి ఒక ఐకానిక్‌గా ఎటువంటి రూపకల్పన ఇప్పటి వరకూ చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలల కిందట నగర ముఖద్వారం ఎన్నారై వై జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలించి చేనేత ఐకాన్‌కు రూపకల్పన చేశామని, ఈ ప్రాంతాన్ని నేతన్న సర్కిల్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే జాతీయ రహదారి అధికారులను సంప్రదించి మౌఖిక అనుమతులు తీసుకున్నామని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి ఈనెల చివరి నాటికి నేతన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. అంతకు ముందుగా ఈ నెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 100 అడుగుల జాతీయ జెండాను నేతన్న సర్కిల్‌లో ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, చేనేత సంఘ నాయకులు ఆకురాతి రాజేష్, దామర్ల కుబేరస్వామి, జగ్గారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో యాదవ కమ్యూనిటీ హాల్ పూర్తి

నగరంలోని కార్పొరేషన్ స్థలాల పరిరక్షణే ధ్యేయమని, కార్పొరేషన్ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా సద్వినియోగ పర్చుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. గురువారం ఆయన ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి నగరంలోని ఇందిరానగర్ కాలనీలో యాదవ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే ఆయా కమ్యూనిటీలకు సంబంధించి హాల్స్ నిర్మాణం చేపట్టామని, తుది దశకు చేరుకోగా త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న మూడు నెలల్లో యాదవ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, రమేష్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు తోట శ్రీనివాసరావు, దానబోయిన నాగయ్య, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

ఏ కష్టం వచ్చినా మీ వెంటే ఉంటానని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాల వారు ఆయా పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. నగరంలోని ఆటోనగర్‌లో గల ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలు పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువాలు మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, దాసరి వీరయ్య, చిలకా తిమోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నగరపాలక సంస్థ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. తొలుత బైపాస్ రోడ్డు వెంబడి ఆరో ఏపీఎస్పీ బెటాలియన్ ప్రధాన రహదారి మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు, సర్దార్ వల్లభాయి పటేల్ ఆర్చి ఈనెల 15వ తేదీ నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు గణపతినగర్ బైపాస్ రోడ్డు వద్ద దేశ మహనీయులతో కూడిన జాతీయ పటాన్ని రూపొందించేందుకు స్థల పరిశీలన చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో కార్యక్రమంలో భాగంగా స్వాతంత్య్ర సమరయోధులతో, మహనీయులతో కూడిన జాతీయ పతాక నిర్మాణానికి, దాని చుట్టూ ఉద్యానవనం ఏర్పాటు నిమిత్తం స్థల పరిశీలన చేశారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ యు శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకకు వెళ్లి తిరిగి వస్తూ...

- కారంచేడు వద్ద రోడ్డు ప్రమాదం
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆటో
- యర్రబాలెం యువకుని దుర్మరణం


బాసాటి నాగ ఆంజనేయులు (ఫైల్)

మంగళగిరి: తన స్నేహితుడి దగ్గర బంధువు పుట్టినరోజు వేడుకకు వెళ్లిన ఓ యువకుడు తిరిగి వస్తూ బుధవారం రాత్రి కారంచేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు... నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం పారిశ్రామిక వాడకు చెందిన బాసాటి వీరయ్య, లక్ష్మి దంపతుల ద్వితీయ కుమారుడు నాగాంజనేయులు (23) మార్బుల్ పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన షేక్ యాసిన్ చీరాలలోని తన బంధువు పుట్టిన రోజు వేడుకకు సరదాగా వెళ్లి వద్దామని బుధవారం ఉదయం నాగాంజనేయులును కోరాడు. ఇద్దరి వద్ద ద్విచక్ర వాహనం లేకపోవడంతో అదే ప్రాంతానికి చెందిన దుర్గారావుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చీరాల చేరుకున్నారు. మద్యం తాగి రాత్రి వరకు వేడుకల్లో సరదాగా గడిపారు. యాసిన్ తన బంధువుల ఇంటి వద్దనే ఆగిపోగా నాగాంజనేయులు ఒక్కడే ద్విచక్రవాహనంపై చీరాల నుంచి యర్రబాలెం బయలుదేరాడు. మార్గంమధ్యలో వెనుక నుంచి వచ్చిన ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గమనించిన స్థానికులు కారంచేడు పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతుని జేబులో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా యర్రబాలెంకు చెందిన యువకుడిగా గుర్తించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాబిన్స్–2023 వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం లైఫ్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ లైఫ్‌సైన్స్ సదస్సు (సాబిన్స్ 2023) నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ అన్నారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో నిర్వహించనున్న ఈ సదస్సుకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, నోబెల్ బహుమతులు సాధించిన శాస్త్రవేత్తలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని అన్నారు. బయోటెక్నాలజీ, వ్యవసాయ, ఫార్మసీ, ఫుడ్ టెక్నాలజీ, రసాయన శాస్త్ర విభాగాలన్నీ కలిపి లైఫ్ సైన్స్ అనే అసోసియేషన్ కిందకు వస్తాయని, ఈ ఐదు రంగాల్లో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు రూపొందించిన పరిశోధనా, అధ్యయన పత్రాలను విశదీకరించనున్నట్లు తెలిపారు. సుమారు 27 దేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొని తాము రూపొందించిన పరిశోధన, అధ్యయన పత్రాలను విద్యార్థులకు విశదపరుస్తారని వివరించారు. అనంతరం ప్రొ చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు, మిజోరం యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ కె.సాంబశివరావులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ముఖద్వారానికి హంగులు

- ప్రకాశం పంతులు విగ్రహం, పార్కు ఏర్పాటు
- మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి


ప్రకాశం బ్యారేజ్ బకింగ్‌హామ్ హెడ్‌స్లూయిస్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

తాడేపల్లిరూరల్: అమరావతి ముఖద్వారం అయిన ప్రకాశం బ్యారేజ్‌కు అనుసంధానంగా ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్క్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ శారదాదేవిలు గురువారం స్థలం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మన చరిత్రను చాటిచెప్పే విధంగా ప్రధాన కూడలిలో మహనీయుల విగ్రహావిష్కరణలు చేపడుతున్నామని, అందులో భాగంగా అమరావతి ముఖద్వారమైన అమరావతి ఉండవల్లి కరకట్ట వెంబడి బకింగ్‌హామ్ వద్ద ప్రకాశం బ్యారేజ్‌కు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సంఘ సంస్కర్త టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పార్కును నిర్మిస్తున్నామని ఈనెల 30వ తేదీలోపు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రకాశం బ్యారేజ్ నమూనాతో పెయింటింగ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి యువజన నాయకులు మహేష్, బీసీ విభాగం నాయకులు దాసు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ఓటర్ జాబితా పరిశీలన

- అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చు
- మంగళగిరి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి లలిత


ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న మంగళగిరి ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.లలిత

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నట్లు మంగళగిరి ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.లలిత అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని 46వ బూత్‌లో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, బూత్ లెవెల్ అధికారులతో కలసి ఆమె పర్యటించారు. లలిత మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి బూత్‌లోను ఓట్లను పరిశీలించేందుకు అసిస్టెంట్ ఎలక్ట్రోల్ అధికారులుగా తాడేపల్లి పట్టణానికి బిక్కిరెడ్డి శివారెడ్డి, మంగళగిరి పట్టణానికి అడిషనల్ కమిషనర్ హేమమాలిని, మంగళగిరి రూరల్ అధికారిగా తహసీల్దార్ రామ్‌ప్రసాద్, దుగ్గిరాల మండలానికి తహసీల్దార్ మల్లేశ్వరి, తాడేపల్లి రూరల్ అధికారిగా తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డిని నియమించామని, వీరందరూ ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో ఏదో ఒక బూత్‌లో పర్యటిస్తారని, అలాగే వారి పరిధిలోని బీఎల్‌ఓలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిశీలిస్తారని అన్నారు. ప్రతి రోజూ, ప్రతి బూత్‌లోను బూత్ లెవల్ సిబ్బంది ఓటరు జాబితాలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించడంతోపాటు కొత్త ఓట్ల నమోదు, ఉన్న ఓట్లలో పేర్లు తప్పులు ఉన్నా, వయస్సు తప్పు ఉన్నా సరిచేయడం, ఎవరైనా మృతి చెందితే వారి ఓటు తొలగించాలన్నారు. రాజకీయపార్టీల అభ్యంతరాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, బూత్ లెవల్ అధికారి శివకీర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



తాడికొండ: జగనన్న సురక్షతో రాష్ట్రంలో అర్హులకు సంక్షేమం, అభివృద్ధి చేరువైందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ నియోజకవర్గంలో జగనన్న సురక్షా క్యాంపెయిన్ విజయవంతమైన సందర్భంగా గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అర్హులెవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందకుండా మిగిలిపోరాదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈ జగనన్న సురక్షా పథకం రాష్ట్ర ప్రజలకు మేలు చేసిందన్నారు. తాడికొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన క్యాంపెయిన్‌ల ద్వారా 80 వేల కుటుంబాలకు గాను 45436 సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, కొప్పుల శేషగిరిరావు, బోడపాటి ధర్మరాజు, బాకి వెంకటస్వామి, రాఘవరెడ్డి, ఆరేపల్లి జోజి, బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేసేందుకు సుప్రీంకోర్టులో కేసు

ఆర్–5 జోన్‌లో పేదలకు న్యాయం చేసేందుకు న్యాయ నిపుణులతో చర్చించి ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు వెళ్లి తప్పక విజయం సాధిస్తుందని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. ఆర్–5 జోన్‌లో పేదల ఇళ్ల స్థలాలను నిలుపుదల చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్పందించిన ఆయన పేదలకు న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే రైతుల ముసుగులో చంద్రబాబు స్టేలు తెచ్చి అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు.

ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: నగరంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఓ ద్విచక్రవాహనం మాయమైన ఘటనపై పట్టణ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు అందింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గుంటూరు నగరంలోని శారదా కాలనీకి చెందిన కర్నాటి లక్ష్మీనారాయణ తాపీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల జులై 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటల సమయంలో తన అన్న కర్నాటి నాగరాజుతో కలసి గుంటూరు నుంచి ద్విచక్రవాహనంపై మంగళగిరికి పని నిమిత్తం వచ్చారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ఓ హోటల్ లో టిఫిన్ చేసేందుకు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి వెళ్లారు. కొద్దిసేపటి అనంతరం తిరిగి వచ్చి చూడగా పార్కింగ్‌లోని ద్విచక్రవాహనం మాయమైంది. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. వాహనదారుడు బుధవారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందజేత

తాడేపల్లిరూరల్: ప్రాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆర్.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలో మూడు కిలోల ఫోర్టిఫైడ్ రైస్, కంది పప్పు, ఆయిల్, పాలు, గుడ్లు, పప్పు చెక్క మొదలైన 11 రకాల పోషకాలతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నారని, వీటిని స్వీకరించడం వల్ల గర్భిణులు, బాలింతలలో రక్తహీనత తగ్గుతుందని వివరించారు. రైతు సంఘం అధ్యక్షులు వి.నాగిరెడ్డి, ఎల్.కృష్ణారెడ్డి, డి.శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పోరాటంలో భాగస్వాములు కండి

మంగళగిరి: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పోరాటంలో ఆశ వర్కర్లందరూ భాగస్వాములు కావాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె లక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఆశ వర్కర్ల ప్రాంతీయ సదస్సులో ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్లలో ఆన్‌లైన్ పనిచేయలేని వారిని మానుకోవాలని బెదిరిస్తున్నారని అన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కమలాకర్ మాట్లాడుతూ పోరాడనిదే ఏ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయదన్నారు. సదస్సులో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు స్వర్ణకుమారి, వాణి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ప్రత్యేకాధికారిగా ప్రసాద్ బాధ్యతల స్వీకారం

తాడికొండ: తాడికొండ కో ఆపరేటివ్ సొసైటీ ప్రత్యేకాధికారిగా బెజ్జం ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత సొసైటీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి పదవీ కాలం జులై 01వ తేదీతో ముగియడంతో ఆ స్థానంలో ప్రత్యేకాధికారిని నియమించడంతో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు.

రైతులకు సాగు సాయం అందించి ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి ప్రసాద్

మంగళగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సాగు సాయం అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించాలనే నినాదంతో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీ ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్ వద్ద నిర్వహించతలపెట్టిన రైతుల ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను నగరంలోని ఏపీ రైతు సంఘ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగిన రైతుల ఆత్మహత్యల్లో ఏపీ మూడో స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టనున్న రైతుల ధర్నా కార్యక్రమానికి రైతులు, కౌలు రైతులుహాజరై విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

14న దేవస్థానం భూమి కౌలు వేలం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని భోగేశ్వరస్వామి దేవస్థానం మెట్టభూమి కౌలు వేలం ఈనెల 14న ఉదయం 11 గంటలకు నిర్వ హి స్తున్నట్లు కార్యనిర్వహణాధికారి అడపాల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో పాల్గొనే కౌలు రైతులు ముందస్తుగా రూ.10,000 చెల్లించాలని, మరిన్ని వివరాలకు 8106991245ను సంప్రదించాలని కోరారు.

यूनियन बैंक ऑफ इंडिया — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మంగళగిరి బ్రాంచి (UBI) 1/643, ఫస్ట్ ఫ్లోర్, ఓల్డ్ జి.టి.రోడ్డు, మెయిన్ రోడ్డు, మంగళగిరి-522503

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ తాడిపర్తి చెన్నకేశవరావు** వారు చెల్లించవలసిన బకాయిమొత్తం **రూ.30,46,249/- (అక్షరాల ముప్పై లక్షల నలభై ఆరు వేల రెండు వందల నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.06.03.2023 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8 ప్రకారము **29 జూలై 2023 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **30.06.2023 తేదీనాటికి చెల్లించవలసిన బకాయిమొత్తం రూ.31,73,878/- (అక్షరాల ముప్పై ఒక్క లక్షల డెబ్బైమూడు వేల ఎనిమిది వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు భవిష్య వడ్డీ & ఇతర ఆకస్మిక చార్జీలు మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, మంగళగిరి రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, మంగళగిరి, నవులూరు, ఆర్‌యస్ నెం.796/ఎ1, డోర్ నెం.4-182, చిల్లపల్లి కన్‌స్ట్రక్షన్స్ నందు గ్రౌండ్‌ఫ్లోర్‌లో శ్రీ తాడిపర్తి చెన్నకేశవరావు పేరునగల 2 బిహెచ్‌కె రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం.102 మరియు అవిభాజ్యపు భాగమైన 48.16 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలముతో సహా యావత్తు. **దీనికి హద్దులు: ఉత్తరం:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము; **తూర్పు:** శూన్యాకాశము; **పడమర:** ఉమ్మడి వరండా.

తేది : 29-07-2023 — సం/- చీఫ్ మేనేజర్, అధీకృత అధికారి
ప్రదేశము : మంగళగిరి — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మంగళగిరి బ్రాంచి (UBI) 1/643, ఫస్ట్ ఫ్లోర్, ఓల్డ్ జి.టి.రోడ్డు, మెయిన్ రోడ్డు, మంగళగిరి-522503

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీమతి షేక్ షాహీనా** వారు చెల్లించవలసిన బకాయిమొత్తం **రూ.43,69,805/- (అక్షరాల నలభైమూడు లక్షల అరవై తొమ్మిది వేల ఎనిమిది వందల ఐదు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.22.02.2023 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8 ప్రకారము **29 జూలై 2023 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **30.06.2023 తేదీనాటికి చెల్లించవలసిన బకాయిమొత్తం రూ.46,33,633/- (అక్షరాల నలభై ఆరు లక్షల ముప్పైమూడు వేల ఆరు వందల ముప్పైమూడు రూపాయలు మాత్రమే)** మరియు భవిష్య వడ్డీ & ఇతర ఆకస్మిక చార్జీలు మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, మంగళగిరి రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, మంగళగిరి, వార్డు నెం.4, పిచ్చానిపేట రోడ్డు, డోర్ నెం.4-114, డి.నెం.240 నందు **శ్రీమతి షేక్ షాహీనా పేరునగల** 112.00 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలము మరియు అందులో నిర్మించిన జి+2 ఫ్లోర్స్ కలిగిన రెసిడెన్షియల్ ఇంటికి సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: ఉత్తరం:** మునిసిపల్ రోడ్డువైపు సరిహద్దు గోడ; **దక్షిణం:** శ్రీ కె.నాగేశ్వరరావుకి చెందిన ఆస్తి; **తూర్పు:** శ్రీ బి.కోటేశ్వరరావుకి చెందిన ఆస్తి; **పడమర:** మునిసిపల్ రోడ్డువైపు సరిహద్దు గోడ.

తేది : 29-07-2023 — సం/- చీఫ్ మేనేజర్, అధీకృత అధికారి
ప్రదేశము : మంగళగిరి — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా